క్లుప్తంగా

క్లాత్ కవర్ల అందజేత



క్లాత్ కవర్లు ప్రదర్శిస్తున్న ఏఈవో

సింహాచలం: చందనోత్సవాన్ని పురస్కరించుకుని ప్రసాదం పంపిణీకి నగరంలోని హనీ గ్రూప్ సంస్థ 10 వేల క్లాత్ కవర్లు సమకూర్చింది. ఆ కవర్లను బుధవారం సింహగిరిపై దేవస్థానం ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావుకు హనీ గ్రూప్ అధినేత ఓబుల్ రెడ్డి అందజేశారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగాక్లాత్ కవర్స్ అందజేసినట్టు ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, ట్రస్ట్ బోర్డు సభ్యురాలు శ్రీదేవివర్మ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీతారామయ్య

పరవాడ: నాయుడుపాలెం కూడలిలో వేసవిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు కూండ్రపు సీతారామయ్య బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కూండ్రపు కృష్ణంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు యమహా నాయుడు, బండారు కృష్ణబాబు, శ్రావణ్‌కుమార్, దాదానాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి పీఏసీఎస్ చైర్మన్‌గా శరగడం



సింహాచలం: పెందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శరగడం నరసింహమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే శరగడంతో పాటు డైరెక్టర్లుగా పెందుర్తి మండలం సరిపల్లికి చెందిన గొల్లవిల్లి భాస్కరరావు, అక్కిరెడ్డిపాలేనికి చెందిన ఇసరపు గోవింద్ నియమితులయ్యారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు నరసింహమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.2 లక్షల విరాళం



ఆలయ కమిటీకి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలో వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ రూ.2లక్షల విరాళం చెక్కు రూపంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో 94వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, చందు యాదవ్, నాయకులు శ్రీను, పద్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 26న బహిరంగ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వామపక్షాల నాయకులు

మద్దిలపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈ నెల 26న కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నామని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు జగ్గునాయుడు, పైడిరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బహిరంగ సభకు ప్రజలు, కార్మికులు, మహిళలు, యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14న ప్రారంభించిన ప్రచార భేరీ కార్యక్రమం 30వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. బీజేపీ విధానాలను ఎండగట్టడానికి 2 లక్షల కరపత్రాల పంపిణీతో పాటు, గ్రూపు మీటింగ్‌లు చేపడుతున్నామన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, తదితరలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే ప్రగతి

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేయాలని అధికారులకు సూచన



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పనిచేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, గృహ నిర్మాణం, విద్యుత్ శాఖల్లోని లోపాలను సరి చేసుకోవాలని ఆదేశించారు. వేసవిలో తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దారు వి.ప్రకాశరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డి పర్యటనను విజయవంతం చేయండి

ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ ఇన్‌చార్జి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఈ నెల 21న పరవాడలో పర్యటించనున్నారని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తెలిపారు. ఆ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పర్యటనలో భాగంగా జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియంను సుబ్బారెడ్డి ప్రారంభిస్తారన్నారు. అనంతరం గొర్లివానిపాలెంలో నిర్వహించే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బైక్ ర్యాలీ ఉంటుందని చెప్పారు. సుబ్బారెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు మండలం నలు మూలల నుంచి నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు.

సమస్యల పరిష్కారానికి హామీ

పరవాడ: కలపాక శివారు మూల స్వయంభూవరం గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల సమస్యలు విన్న ఎమ్మెల్యే ఒక్కో సమస్య.. పరిష్కార స్థితిని వివరించడంతో గ్రామస్తులు సంతోషంతో వెనుదిరిగారు.

- తాగునీటి సరఫరా పైపులైన్ మరమ్మతులు రూ.35 లక్షలతో చేపట్టాలని అధికారులకు సూచించారు.
- గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.
- గ్రామానికి తిరుగుతున్న సిటీ బస్సు యధావిధిగా నడపాలని ఆర్టీసీ అధికారులను కోరగా త్వరలో 64ఎ సిటీ బస్సు నడపడానికి అధికారులకు అంగీకరించారని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వివరించారు.

'జగనన్నే మా భవిష్యత్'కు విశేష ఆదరణ



భర్నికంలో పేదలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న సర్పంచ్ పూజాశేఖర్



ముత్యాలమ్మపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

పరవాడ: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురదరాజు చెప్పారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులతో కలిసి వాడచీపురుపల్లిలో బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు పూర్తి కాలం అమలు కావాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ప్రజలంతా అండగా నిలవాలని బురదరాజు కోరారు. ఇంటి యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను ఇంటి గోడకు అతికించారు. కార్యక్రమంలో కూండ్రపు తాతాజీ పాల్గొన్నారు.

- భర్నికంలో సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్, స్థానిక నాయకులు ఇంటింటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు.
- ముత్యాలమ్మపాలెంలో బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు.

సింహగిరికి గంధం అమావాస్య తాకిడి



పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- భారీగా చేరుకున్న భక్తులు

సింహాచలం: గంధం అమావాస్య పురస్కరించుకుని ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పెద్ద ఎత్తున గ్రామీణ ప్రాంతాల భక్తులు, మత్స్యకారులు బుధవారం సాయంత్రానికే సింహాచలం చేరుకున్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో చందనోత్సవం ముందు వచ్చే అమావాస్యను గ్రామీణ ప్రాంతాల భక్తులు, మత్స్యకారులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. కుటుంబాలతో కలిసి సింహగిరికి తరలివస్తారు. ముందు రోజు చేరుకుని వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తారు. వంటలు వండుకుని పంక్తి భోజనాలు చేస్తారు. ఈ సారి గంధం అమావాస్య గురువారం కావడం, అమావాస్య బుధవారం ఉదయం 11గంటల నుంచే రావడంతో మధ్యాహ్నం నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. రాత్రికి భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. భక్తులతో వరాహ పుష్కరిణి మార్గం అంతా కిటకిటలాడింది.

పాడి పశువుల చెంతకే వైద్యం



వైఎస్సార్ సంచార పశు వైద్య సేవా రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: మూగజీవాలకు వైద్యం అందించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంచార పశు వైద్య సేవా రథాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. పరవాడలో వైఎస్సార్ సంచార పశు వైద్య సేవా రథాన్ని ఎమ్మెల్యే బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. పాడి పశువులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించడానికి సంచార పశు వైద్య సేవా రథం అనేక విధాలుగా దోహదపడుతుందన్నారు. పాడి రైతులు 1962 నెంబరుకు ఫోన్ చేస్తే వెంటనే సిబ్బంది స్పందించి మూగజీవాల వద్దకే వచ్చి వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పరవాడ పశు వైద్య కేంద్ర సబ్ డివిజనల్ ఏడీ రామకృష్ణకీర్తి, డాక్టర్ అశ్విని, డాక్టర్ మౌలిక, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకోవడానికే 'గడప గడపకు'..

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడం, అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలనే ధ్యేయంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 95వవార్డు 500 సచివాలయం పరిధి పార్లుపాలెంలో ఎమ్మెల్యే బుధవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు , నాయకులు రాపర్తి మాధవరావు, ఆకుల గుణకర్, పెదగడి చిన్నారావు పాల్గొన్నారు.

ఎన్ఏడీలో భారీ రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న కార్మికులు

గోపాలపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా నేవల్ ఆర్మమెంట్ డిపో ఆడిటోరియంలో బుధవారం భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని చీఫ్ జనరల్ మేనేజర్ నివారి ప్రారంభించారు. వర్క్స్ కమిటీ, కార్మికులు సమష్టిగా రక్త దానశిబిరం నిర్వహించారన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందని నివారి అన్నారు. సామాజిక కార్యక్రమాల్లో ఉద్యోగులు, కార్మికులు పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. సుమారు 200 మంది కార్మికులు రక్తదానం చేశారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లిలో రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ బోకం సూర్యకుమారి బుధవారం శంకుస్థాపన చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోకం రామునాయుడు, సర్పంచ్ నేబర్తి శ్రీను, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-2 పరిధిలోని 33/11కేవీ, అంతకాపల్లి సబ్‌స్టేషన్-11కేవీ గుల్లేపల్లి రూరల్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ డీఈఈ నిరీక్షన్ అంబేడ్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. అంతరాయం ఉండే గ్రామాలు గుల్లేపల్లి,మొగలిపురం,మల్లునాయుడుపాలెం.బోదువలస,ఎల్లుప్పి,అయ్యన్నపాలెం,దుడ్డువాక,కిల్లివానిపాలెం,రాపర్తివానిపాలెం,మర్రిపాలెం.

శరవేగంగా డ్రైనేజీ పనులు

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు సింహాద్రినగర్‌లో రూ.1.97లక్షల నిధులతో డ్రైనేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి కావడంతో ప్రైయార్టీ పనుల్లో భాగంగా సింహాద్రినగర్‌లో డ్రైనేజీ పనులు చేపట్టారు. సంబంధిత పనులను బుధవారం 93వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు పరిశీలించారు. నాణ్యతా లోపం లేకుండా పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరిబాబు, అప్పలరాజు, వెంకటేష్, శివకృష్ణ, సంతోష్, హర్ష పాల్గొన్నారు.

ఆదర్శ నాయకుడు గౌతు లచ్చన్న



గౌతులచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ: ఆదర్శ నాయకుడు సర్దార్ గౌతులచ్చన్న అని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కొనియాడారు. గొర్లివానిపాలెం గౌతులచ్చన్ననగర్ కూడలి వద్ద స్వర్ణాంధ్ర మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో గౌతులచ్చన్న 17వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ గౌతులచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. లచ్చన్న ఆశయ సాధనకు ప్రతిఒక్కరు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపీ అమ్మలు, ఎంపీటీసీ వరలక్ష్మి , మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు, సొసైటీ అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు, సభ్యులు రేలంగి ధనరాజు, నారాయణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జ్ఞానసామర్థ్యం అంచనాకు సర్వే



విద్యార్థులతో రుమాడీశర్మ

పరవాడ: బాలికా సాధికారిత మిషన్-2023లో భాగంగా విద్యార్థుల జ్ఞాన సామర్థ్యం అంచనా వేయడానికి వీలుగా సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలి నగర్‌లోని హీరో మైండ్‌మైన్, బాలభారతి పబ్లిక్ స్కూల్ సహకారంతో బుధవారం బేస్‌లైన్ సర్వే నిర్వహించింది. ఈ సర్వే కార్యక్రమంలో 11 ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన 51 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆ విద్యార్థులతో సంస్థ హెచ్ఆర్ రుమాడీ శర్మ సంభాషించారు. బేస్ లైన్ సర్వే కార్యక్రమం వ్యక్తిత్వ వికాసం, శుభ్రతను పెంపొందించడానికి సహాయపడుతుందని చెప్పారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ వేడుక

- నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ 1972-73 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం
- నాలుగు దశాబ్దాల తర్వాత సందడి



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మద్దిలపాలెం: నక్కవానిపాలెంలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో 1972-73 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. ఇందుకు పిఠాపురం కాలనీలోని పూర్వ విద్యార్థి ఇల్లు వేదికగా నిలిచింది. మేము వయస్సుకు వచ్చామంటూ నాలుగు దశాబ్దాల క్రితం చేసిన అల్లరిని నెమరువేసుకున్నారు.. ఆనాటి స్నేహ బంధంలో మాధుర్యాన్ని గుర్తు చేసుకున్నారు. మనసారా నవ్వుతూ మధుర జ్ఞాపకాల లోకంలో విహరించారు. ఒరేయ్ ఎలా ఉన్నావంటూ మిత్రబంధంతో పలకరింపులు, కుశలమా మిత్రమా అంటూ ఆత్మీయ ప్రశ్నలతో ఉత్సాహంగా గడిపారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు. ఆరోగ్యపరిస్థితి, కుటుంబ విషయాలను చర్చించుకున్నారు. ఆ రోజుల్లో పెద్దలన్నా.. గురువులన్నా ఎంతో గౌరవంగా ఉండేవారంటూ చెప్పుకున్నారు. అనంతరం అందరూ కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.అప్పారావు, బి.కె.రెడ్డి, కండిపల్లి సుబ్బారావు, కాగిత రమేష్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని బలవన్మరణం

ఎంవీపీ కాలనీ: వెంకోజీపాలేనికి చెందిన సాబి లావణ్య అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. వెంకోజీపాలేనికి చెందిన శ్రీను, అతని భార్య కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమార్తెలను చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె లావణ్య ప్రస్తుతం విజయనగరం ఎంఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. తల్లిదండ్రులు బుధవారం పనులకు వెళ్లగా లావణ్య ఇంట్లోనే ఉంది. వారు వచ్చి చూసేసరికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని కనిపించింది. ఎంవీపీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే లావణ్య తాను ఠాగూర్ అనే యువకుణ్ని ప్రేమిస్తున్నట్లు, అతనితో కలిసి జీవించే అవకాశం లేకనే చనిపోతున్నట్టు సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలకు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సీపీఎం నాయకుడు కృష్ణమూర్తి కన్నుమూత



కృష్ణమూర్తి(ఫైల్)

ఆరిలోవ: సుదీర్ఘ కాలం పాటు సీపీఎంలో సేవలు అందించిన వి.కృష్ణమూర్తి(67) బుధవారం వేకువజామున గుండెపోటుతో కన్నుమూశారు. ఆరిలోవలోని ఆయన నివాసంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించే సమయానికే ఆయన మృతి చెందినట్లు వెల్లడించారు. దీంతో కుటుంబ సభ్యులు తిరిగి ఆరిలోవ తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకుని కృష్ణమూర్తి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, కార్పొరేటర్ బి.గంగారావు, సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు జగ్గునాయుడు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఎం.మణి, నరేంద్రకుమార్, శంకరరావు, సూర్యమణి, రంగమ్మ, సీపీఐ జిల్లా నాయకుడు రెహమాన్ తదితరులు అంజలి ఘటించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో నాయకులు మాట్లాడుతూ కృష్ణమూర్తి చేసిన పోరాటాలు, అందించిన సేవలను కొనియాడారు. పోరాట పటిమ ఉన్న మంచి వ్యక్తిని సీపీఎం కోల్పోయిందని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ సంస్మరణ సభలో కన్నీరుపెట్టుకున్నారు. కృష్ణమూర్తికి భార్య అన్నపూర్ణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఏఎంసీకి పార్థివదేహం అప్పగింత

కృష్ణమూర్తి ఆలోచనలకు అనుగుణంగా కుటుంబ సభ్యులు ఆయన పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం అప్పగించడానికి అంగీకరించారు. ఇందులో భాగంగా అతని నేత్రాలు ఎల్వీపీ కంటి ఆస్పత్రికి దానం చేశారు. అనంతరం పార్థివ దేహానికి అంతిమ యాత్ర నిర్వహించి, కుటుంబ సభ్యులు, సీపీఎం, సీపీఐ నాయకులు ర్యాలీగా తీసుకెళ్లి ఏఎంసీకి అప్పగించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

ఆరిలోవ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆరిలోవలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరిలోవ ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టీఐసీ పాయింట్ వద్ద నివాసముంటున్న రాపర్తి వంశీ(33) ఇసుకతోట సమీప విష్ణు హోండా షోరూంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య జ్యోతి ఓ బంగారం ఫైనాన్స్ సంస్థలో పని చేస్తోంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు. ఎప్పటిలాగే బుధవారం డ్యూటీకి వెళ్లిన వంశీ.. షోరూం నుంచి ఉదయం 10 గంటలకు వేరే బైక్‌తో బయటకు వచ్చి తిరిగి షోరూంకు వెళ్లలేదు. దీంతో షోరూం మేనేజర్ ఉదయం 11.30 గంటలు, మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. అతని భార్య జ్యోతి కూడా డ్యూటీ నుంచి మధ్యాహ్నం 12.50 గంటలకు ఇంటికి వచ్చింది. తలుపునకు లోపల నుంచి గడియపెట్టుకొని ఇంట్లో ఎవరో ఉండడాన్ని ఆమె గమనించింది. తలుపులు ఎంతకొట్టినా తీయకపోవడంతో స్థానికుల సహాయంతో తాళం పగలుగొట్టి చూసేసరికి ఇంట్లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని వంశీ వేలాడుతున్నాడు. దీంతో ఆమె కన్నీటిపర్యంతమై బంధువులకు సమాచారం అందించింది. ఈ విషయం తెలుసుకున్న ఆరిలోవ సీఐ సోమశేఖర్, ఎస్ఐ అనిల్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఆత్యహత్యకు గల కారణాల గురించి ఆరా తీశారు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

ప్రమాదానికి కారణాలపై ఆరా



ప్రమాదానికి కారణాలు తెలుసుకుంటున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో విష్ణు కెమికల్ పరిశ్రమలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఇరువురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.క్షతగాత్రులు నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాద స్థలాన్ని బుధవారం అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను యాజమాన్య ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న కార్మికుల పరిస్థితి ప్రస్తుతం మెరుగ్గా ఉందని పరవాడ సీఐ ఈశ్వరరావు చెప్పారు.